ఆంధ్రజ్యోతి

5



ANDHRAJYOTHY

చిత్తూరు జిల్లా వార్తలు

శుక్రవారం 7 జూన్ 2024

ఈవీఎం గోదాముకు తాళం



రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఈవీఎం గోదాములకు సీల్ వేస్తున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 6: ఎన్నికల కౌంటింగ్‌లో ఉపయోగించిన ఈవీఎంలను కలెక్టరేట్‌లోని రెండు గోదాముల్లో భద్రపరిచారు. చిత్తూరు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను గోదాముల్లో భద్రపరిచి, సీల్ వేసినట్లు డీఆర్వో పుల్లయ్య తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సురేంద్రకుమార్ (టీడీపీ), ఉదయ్ (వైసీపీ), ఉదయ్ కుమార్ (బీఎస్పీ), బీసీ కార్పొరేషన్ ఈడీ, ఈవీఎం మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు పెద్దపంజాణి ఎస్ఐ




పెద్దపంజాణి జూన్ 6: పెద్దపంజాణి ఎస్ఐ శ్రీనివాసులును వీఆర్‌కు పంపారు. మండలంలో ఏకపక్ష ధోరణితో వ్యవహరించారన్న ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. వీరప్పల్లెలోని సచివాలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాలు ధ్వంసం చేశారు. ఎటువంటి విచారణ లేకుండా, స్థానిక వైసీపీ నాయకుడి ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి 11 గంటలకు టీడీపీకి చెందిన హరి, కిరణ్ సహా ఏడుగురు యువకులపై ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఎటువంటి విచారణా లేకుండా అర్ధరాత్రి కేసు నమోదు చేయడంపై ఎస్ఐ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం విమర్శలకు తావిచ్చింది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులకూ ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఎస్ఐను వీఆర్‌కు పంపి, విచారణ చేపట్టారు. కాగా, ఎన్నికల ముందు కూడా మండలంలోని కొందరు టీడీపీ నేతలను ఆయన వైసీపీలోకి పంపే పనులు చేశారన్న ఆరోపణలూ ఉన్నాయి. గతంలో ఆయన పనిచేసిన వి.కోట, బైరెడ్డిపల్లెలోనూ ఏకపక్షంగా వ్యవహరించినట్లు సమాచారం.

విద్యాశాఖలో అక్రమ బదిలీలకు బ్రేక్!

చిత్తూరు (సెంట్రల్), జూన్ 6: విద్యాశాఖలో జరిగిన అక్రమ బదిలీలకు బ్రేక్ పడింది. కొత్త ప్రభుత్వం రావడంతో ఎన్నికలకు ముందు విద్యాశాఖలో చేపట్టిన అక్రమబదిలీలు నిలుపుదల చేయాలని విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ జారీ చేసిన ఆదేశాలు గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందాయి. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన బదిలీల్లో భాగంగా చిత్తూరులో 140 మందికి పైగా ఉపాధ్యాయ బదిలీలు జరిగాయి. ఎలాంటి ప్రభుత్వ జీవో లేకుండా, సింగిల్ జీవోలతో పలువురు ఉపాధ్యాయులు, లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన వారు కోరుకున్న చోటికి బదిలీలు చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. వీటి ఆధారంగా డీఈవో సంతకాలు చేసి బదిలీలు చేశారు. ఇలాంటి బదిలీలను నిలుపుదల చేయాలని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల ముందు చేపట్టిన అక్రమ బదిలీలపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టనున్నారు. ఎలాంటి ఆధారాలు చూపి వీరంతా బదిలీలు చేసుకున్నారు. ఇందులో ఉపాధ్యాయుల స్వప్రయోజనాలు ఎంత? బదిలీలకు ఎంత ఖర్చు చేశారు, దీని వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలోనూ లోతుగా పరిశీలించనున్నారు. దీంతో బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు గుబులు పట్టుకుంది. ఇప్పటి వరకు బదిలీలైన వారు తిరిగి వారి పాత స్థానాలకు రావాల్సి ఉండగా, ఇంకా రిలీవ్ కాని వారు ప్రస్తుతం ఉన్న స్థానాల్లోనే విధులు నిర్వహించాల్సి ఉంది. లక్షల రూపాయలు ఖర్చు చేసిన కూడా ప్రయోజనం లేకపోవడంతో పాటు చోటు చేసుకునే పరిణామాలు ఎలా ఎదుర్కోవాలనేది టీచర్లలో ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉండగా సర్దుబాటు ప్రక్రియలో భాగంగా లాబీయింగ్ జరిపి డిప్యుటేషన్‌పై వెళ్లిన వాళ్లు వెనక్కి వచ్చే పరిస్థితులు లేకపోలేదు. విద్యాశాఖలో అక్రమ బదిలీలు, డిప్యుటేషన్ల అంశంపై కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకునేంత వరకు ఎలాంటి మార్పులు, చేర్పులు చేసినా, పరిణామాలు తీవ్రంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

అభ్యర్థులను మార్చినా అపజయమే



- బెడిసికొట్టిన జగన్ వ్యూహం
- విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, కృపాలక్ష్మికి తప్పని పరాభవం

చిత్తూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో వ్యతిరేకత ఉందని వైసీపీ అధ్యక్షుడు జగన్ పెద్ద ఎత్తున అభ్యర్థుల్ని మార్చేశారు. ఇలా జిల్లాలో చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు ప్రాంతాల్లో కొత్తవారికి అవకాశం ఇచ్చారు. ఎంత చేసినా కూటమి గాలిలో జగన్ వ్యూహం ఫలించలేదు. పాత అభ్యర్థులతో పాటు కొత్త అభ్యర్థులు సైతం ఘోర పరాజయం పాలయ్యారు.

ఆరణిని కాదని విజయానందరెడ్డికి..

జిల్లా కేంద్రం చిత్తూరులో అప్పటి సిటింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కాదని విజయానందరెడ్డికి జగన్ అవకాశం ఇచ్చారు. ఐదేళ్ల పాటు పవర్ సెంటర్ విజయానందరెడ్డి వద్ద ఉన్నా ఆరణి ఓర్చుకున్నారు. ఎన్నికలు వచ్చే నాటికి ఆరణి మీద ప్రజల్లో వ్యతిరేకత ఉందని సర్వే పేరుతో పక్కన పెట్టేశారు. విజయానందరెడ్డి అయితే సులువుగా గెలిచిపోతారని జగన్ భావించారు. ఆరణికి రాజ్యసభ అవకాశం ఇస్తానని చెప్పి హ్యాండిచ్చారు. దీంతో ఆయన జనసేనలో చేరిపోయి తిరుపతి నుంచి పోటీ చేశారు. ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలిచి తానేంటో వైసీపీకి తెలియజేశారు. చిత్తూరులో మాత్రం విజయానందరెడ్డిని ప్రజలు వద్దనుకున్నారు. నాలుగేళ్ల పాటు పండుగలకు దుస్తులు, బహుమతులు పంచినా అతన్ని తిరస్కరించారు. అనూహ్యంగా విజయానందరెడ్డి ఆశలు పెట్టుకున్న చిత్తూరు నగరంలోనే వైసీపీ చిత్తుగా ఓడిపోయింది. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ 14వేలకు పైగా ఓట్లతో గెలిచారు.

ఎంఎస్ బాబును అవమానించి..

2019 ఎన్నికల సమయంలో అప్పటి పూతలపట్టు ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను వైసీపీ ఘోరంగా అవమానించిన తీరు జిల్లా దళితులు మరచిపోలేదు. మరోసారి తాజా ఎన్నికల్లో ఎంఎస్ బాబును వైసీపీ అవమానించింది. ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి పెత్తనంతో డమ్మీ ఎమ్మెల్యేగా పనిచేసిన ఎంఎస్ బాబుకు టికెట్ ఇవ్వలేదు. మీడియాతో తన బాధను చెప్పుకున్న ఆయన్ను పెద్దిరెడ్డి హెచ్చరించి మరీ మరో వీడియో విడుదల చేసిన విషయం తెలిసిందే. చివరికి ఆయన వైసీపీ ఓటమే లక్ష్యంగా కాంగ్రెస్‌లో చేరి పూతలపట్టు నుంచి పోటీ చేశారు. 2820 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ చేతిలో వైసీపీ అభ్యర్థి సునీల్‌కుమార్ 15వేలకుపైగా ఓట్లతో ఓడిపోయారు.

జీడీనెల్లూరులో మూడుసార్లు మార్చి..

జీడీనెల్లూరులో నారాయణస్వామికి వ్యతిరేకత ఉందని చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా మారుస్తూ, రెడ్డెప్పను జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మారుస్తూ ఓసారి ప్రకటించారు. మరోసారి వారి స్థానాల్లో యథావిధిగా పెడుతూ ప్రకటించారు. మూడోసారి నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మికి అవకాశమిచ్చారు.స్థానికంగా నేతల్లో, ప్రజల్లో వ్యతిరేకత మూటగట్టుకున్న నారాయణస్వామిని.. ఎలాంటి రాజకీయ అనుభవం లేని టీడీపీ అభ్యర్థి థామస్ దీటుగా ఎదుర్కొన్నారు. అంతకు ముందు వేపంజేరి, ఆ తర్వాత జీడీనెల్లూరులో మూడు దశాబ్దాల తర్వాత థామస్ ఇక్కడ టీడీపీ జెండాను ఎగరేశారు. 26 వేల ఓట్ల మెజార్టీతో ఆయన గెలిచారు.



స్ట్రాంగ్‌రూమ్‌కు కౌంటింగ్ సామగ్రి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 6: ఓట్ల లెక్కింపు సందర్భంగా వాడిన, వాడని సామగ్రి కలిగిన వందకు లోపు ట్రంకు పెట్టెలను కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ స్ట్రాంగ్ రూమ్‌లో గురువారం భద్రపరిచారు. నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాల్లో వాడిన, వాడని పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, పీవో డైరీ, 17ఏ రిజిస్టర్, విజిట్ షీట్స్, పోస్టల్ కవర్స్ తదితర సామగ్రిని కౌంటింగ్ కేంద్రాల నుంచి ట్రంకుపెట్టెల్లో నింపి పోలీసు బందోబస్తు మధ్య జిల్లా ఖజానా కార్యాలయ ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. వాటిని సిబ్బంది నమోదు చేసి స్ట్రాంగ్‌రూమ్‌లో ఉంచారు.

టీడీపీకి పూర్వ వైభవం

కూటమికిది చరిత్రాత్మక విజయం

ఎన్టీఆర్ నాటి ప్రభంజనాలకు చేరువైన పార్టీ



తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో టీడీపీ కూటమి చరిత్రాత్మక విజయం నమోదు చేసింది. సూటిగా చెప్పాలంటే పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు నాటి ప్రభంజనాలకు ఈసారి టీడీపీ కూటమి చేరువగా వచ్చింది. మొత్తం 14 అసెంబ్లీ స్థానాలకు గానూ 12 స్థానాలను కూటమి గెలుచుకుంది. దీనితో పాటు చిత్తూరు ఎంపీ సీటు దక్కించుకుని జిల్లాలో పూర్వ వైభవాన్ని సాధించింది. టీడీపీ ఆవిర్భవించాక 1983లో జరిగిన తొలి ఎన్నికల్లో అప్పటికి 15 అసెంబ్లీ స్థానాలున్న ఉమ్మడి జిల్లాలో ఏకంగా 14 స్థానాలను గెలుచుకుని చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. అప్పట్లో తంబళ్లపల్లె మినహా మదనపల్లె, వాయల్పాడు, పీలేరు, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, నగరి, పుత్తూరు, వేపంజేరి, చిత్తూరు, పలమనేరు, కుప్పం, పుంగనూరు అసెంబ్లీ స్థానాలలో ఎన్టీఆర్ ప్రభంజనంతో టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. అలాగే అప్పట్లో జిల్లాకు సంబంధించి చిత్తూరు, తిరుపతి, రాజంపేట ఎంపీ స్థానాలను కూడా కైవసం చేసుకుంది.ఆ తరహా ప్రభంజనాన్ని టీడీపీ మళ్లీ 1994లో ప్రదర్శించింది. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో మొత్తం 15 అసెంబ్లీ స్థానాలకు చిత్తూరు మినహా 14 స్థానాలనూ గెలుచుకుంది. చిత్తూరులో సీకే బాబు స్వల్ప ఆధిక్యతతో గెలిచి కాంగ్రెస్ ఉనికి కాపాడారు. తర్వాతెప్పుడూ జిల్లాలో టీడీపీ మెజారిటీ స్థానాలు సాధించింది లేదు. చివరికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా వుండగా జరిగిన 1999, 2004 ఎన్నికల్లో కూడా మెజారిటీ స్థానాలు కాంగ్రెస్‌కే దక్కాయి. ఇక 2014 ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు మళ్లీ సీఎం అయినప్పటికీ జిల్లాలో మాత్రం యథాప్రకారం ప్రతిపక్షమైన వైసీపీకే అత్యధికంగా ఎనిమిది సీట్లు దక్కాయి. ఇక 2019 ఎన్నికల్లో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలకు గానూ టీడీపీకి కుప్పం ఒక్కటే దక్కింది. మిగిలిన 13 సీట్లూ వైసీపీ పరమయ్యాయి. తాజా ఎన్నికల్లో టీడీపీ మళ్లీ ప్రభంజనం సృష్టించింది. 14 స్థానాల్లో రెండు మినహా 12 స్థానాలూ టీడీపీ స్వీప్ చేసింది. చిత్తూరు ఎంపీ సీటు కూడా కైవసం చేసుకుంది. పుంగనూరు, తంబళ్లపల్లె సెగ్మెంట్లను కూడా స్వల్ప తేడాతోనే కోల్పోయింది.

అభ్యర్థులు సైతం ఊహించని భారీ ఆధిక్యతలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి తాజా ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు చాలావరకూ భారీ ఆధిక్యతలు సాధించారు. తిరుపతిలో కూటమి తరపున జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అత్యధికంగా 61 వేలకు పైగా మెజారిటీ తెచ్చుకోగా కుప్పంలో చంద్రబాబుకు 48 వేలకు పైగా, నగరిలో గాలి భానుప్రకాష్‌కు 45 వేలకు పైగా, చంద్రగిరి, శ్రీకాళహస్తిల్లో పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి 43 వేలకు పైగా ఆధిక్యత సాధించారు. జీడీనెల్లూరులో థామస్ 26 వేలకు పైగా, పీలేరులో నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి 25 వేలకు పైగా మెజారిటీ దక్కించుకున్నారు.పలమనేరులో అమరనాథరెడ్డి 20 వేలకు పైగా, పూతలపట్టులో మురళీమోహన్ 15 వేలకు పైగా, చిత్తూరులో జగన్మోహన్ 14 వేలకు పైగా ఆధిక్యత పొందారు. మదనపల్లెలో షాజహాన్ 5 వేలకు పైగా, సత్యవేడులో ఆదిమూలం 3 వేలకు పైగా తేడాతో గెలుపొందగా వీరిద్దరి ఆధిక్యతే తక్కువ. ఈ రెండు చోట్ల మినహా 10 స్థానాల్లో ఇంత భారీ మెజారిటీలను గెలిచిన అభ్యర్థులు కూడా ఊహించలేదు.

సాధారణ మెజారిటీలను రెట్టింపు చేసిన స్థానిక పరిస్థితులు

వైసీపీ ప్రభుత్వంపై నెలకొన్న వ్యతిరేకత కారణంగా పలువురు టీడీపీ అభ్యర్థులకు సాధారణ మెజారిటీ రాగా కొన్ని చోట్ల స్థానిక పరిస్థితులు మెజారిటీలను అమాంతం పెంచేశాయి. ఉదాహరణకు తిరుపతి సీటునే తీసుకుంటే స్థానికేతరుడైన ఆరణి శ్రీనివాసులు గెలుపు కష్టమని పలువురు భావించారు. అందునా చిత్తూరులో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా వుండి హఠాత్తుగా తిరుపతిలో జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగడంతో తిరుపతిలోని టీడీపీ, జనసేన శ్రేణులు తొలుత సహకరించలేదు. అయితే ఇక్కడ అధికార పార్టీ నేతల తీరు, వ్యవహారశైలి పట్ల జనంలో నెలకొన్న తీవ్ర వ్యతిరేకత కూటమి అభ్యర్థి మెజారిటీలో ప్రతిఫలించింది. శ్రీకాళహస్తిలోనూ ఇదే పరిస్థితి. వైసీపీ అభ్యర్థిపై తీవ్ర స్థాయి అవినీతి ఆరోపణలు ప్రచారంలో వుండడం ప్రజల్లో ఆయన పట్ల వ్యతిరేకతను విపరీతంగా పెంచేసింది. దానివల్లే టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌కు భారీ మెజారిటీ వచ్చిందని పలువురు భావిస్తున్నారు. నగరిలోనూ వైసీపీ అభ్యర్థి రోజా మీద అవినీతి ఆరోపణలకు సొంత పార్టీలో నేతల వ్యతిరేకత తోడు కావడంతో టీడీపీ అభ్యర్థి గాలి భానుకు అనూహ్య మెజారిటీ వచ్చింది. భాను గెలుస్తారని అన్ని వర్గాలూ ముందుగానే నిశ్చితాభిప్రాయానికి వచ్చినా ఈ మెజారిటీని ఎవరూ అంచనా వేయలేదు.చంద్రగిరిలో పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా వున్న చెవిరెడ్డి భాస్కర రెడ్డిపై వ్యతిరేకత ప్రబలింది. సొంత పార్టీలోనూ నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి ప్రబలింది. కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు విస్తృతంగా ప్రచారమయ్యాయి. అయినా టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ స్వల్ప మెజారిటీతో గట్టెక్కుతారని సొంత పార్టీ వర్గాలే భావించాయి. కానీ అభ్యర్థి కూడా ఊహించని రీతిలో 43 వేలకు పైగా మెజారిటీ రావడం సంచలనం రేపుతోంది.పీలేరులో కూడా నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుస్తారని అందరూ భావించినా పాతిక వేల మెజారిటీ ఊహించలేదు. చాలా నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు సాధించిన మెజారిటీలు రికార్డు సృష్టించాయంటే అతిశయోక్తి కాదు. మొత్తం మీద అనూహ్య ఆధిక్యతలతో జిల్లావ్యాప్తంగా టీడీపీ శ్రేణులు సంబరపడిపోతున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమీక్ష 2014-2019-2024

సెగ్మెంట్	2014 టీడీపీ ఓట్లు	2014 వైసీపీ ఓట్లు	విజేత ఆధిక్యత	2019 టీడీపీ ఓట్లు	2019 వైసీపీ ఓట్లు	విజేత ఆధిక్యత	2024 టీడీపీ ఓట్లు	2024 వైసీపీ ఓట్లు	విజేత ఆధిక్యత
తంబళ్లపల్లి	82090	72900	9190టీ	58506	105444	46938వై	84033	94136	10103వై
పీలేరు	33857	71949	38092వై	79426	87300	7874వై	105582	80501	25081టీ
మదనపల్లె	64663(టీడీపీ-బీజేపీ)	81252	16589వై	62418	92066	29648వై	97980	92471	5509టీ
పుంగనూరు	72856	104587	31731వై	63876	107431	43555వై	94968	100793	6095వై
చంద్రగిరి	96406	100924	4518వై	86035	127790	41755వై	143667	99815	43852టీ
తిరుపతి	99313	57774	41539టీ	79836	80544	00708వై	124107(కూటమి)	62151	61956జే
శ్రీకాళహస్తి	89953	82370	7583టీ	71400	109541	38141వై	121565	78261	43304టీ
సత్యవేడు	77655	73428	4227టీ	59197	103941	44744వై	85471	81732	3739టీ
నగరి	73866	74724	858వై	77625	80333	2708వై	107797	62793	45004టీ
జీడీనెల్లూరు	63973	84538	20565వై	57444	102356	44912వై	101176	75165	26011టీ
చిత్తూరు	73430	66631	6799టీ	51238	91206	39968వై	88066	73462	14604టీ
పూతలపట్టు	82298	83200	902వై	74102	103265	29163వై	102137	86503	15634టీ
పలమనేరు	93651	96541	2890వై	87625	119241	31616వై	123232	103110	20122టీ
కుప్పం	102952	55831	47121టీ	100146	69424	30722టీ	121929	73923	48006టీ
మొత్తం	11,06,963	11,06,649	314టీ	10,08,874	13,79,882	3,71,008వై	15,01,710	11,64,846	3,36,864టీ

మా క్వారీని వదిలి వెళ్లండి

- సుగాలిమిట్ట పీఎల్‌ఆర్ క్వారీ వద్ద యువకుల వివాదం
- పెద్దిరెడ్డి ఆక్రమించుకున్నారంటూ ఆరోపణ
- తహసీల్దారు వద్ద బైండోవర్ చేసిన పోలీసులు

పుంగనూరు, జూన్ 6: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించి నడుపుతున్న తమ క్వారీలో పనులు ఆపి వెళ్లిపోవాలంటూ కొందరు యువకులు డిమాండు చేశారు. ఈ మేరకు గురువారం పుంగనూరు మండలం సుగాలిమిట్ట సమీపంలో పీఎల్‌ఆర్ క్వారీ వద్దకు వీరు వెళ్లి పనులను అడ్డుకున్నారు. ఎన్నికల ముందు పుంగనూరుకు చెందిన ఆర్వీటీ బాబు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈయన అనుచరులైన కొందరు యువకులు క్వారీ వద్దకు వెళ్లి పనులు ఆపాలన్నారు. వెంటనే క్వారీ సిబ్బంది పోలీసులకు ఫోన్ చేసి అనుమానితులు తిరుగుతున్నట్లు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు ఆ యువకులను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ శివయ్యవద్ద బైండోవర్ చేశారు.

అధికార బలంతో పెద్దిరెడ్డి లాక్కున్నారు: బాబు

క్వారీ వివాదంపై డీఎస్పీ విష్ణురఘువీర్ విచారించారు. ఆ క్వారీ ఆర్వీటీ బాబుదిగా యువకులు చెప్పారు. దీనిపై ఆయన బాబుకు ఫోను చేశారు. '2019లో నేను క్వారీకి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వ అనుమతులు వచ్చాయి. నాకు వచ్చిన క్వారీ అనుమతులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికార బలంతో లాక్కున్నారు. ప్రస్తుతం నాకున్న అనుమతులతో.. నా క్వారీ నాకే కావాలి. పనులు నిలిపివేయాలని కోరాం. వైసీపీ ప్రభుత్వంలో పేదల భూములు, ఆస్తులు లాక్కున్నారు. ప్రస్తుతం ప్రజల ప్రభుత్వం రాగానే మా ఆస్తులు కావాలని కోరుతున్నాం. అన్ని రికార్డులు మాకు ఉన్నాయి. వారిని ఖాళీ చేయించండి' అని ఆయన డీఎస్పీని కోరారు.



క్వారీ వద్దకు చేరుకున్న పోలీసులు

ఏ సమస్య ఉన్నా మా దృష్టికి తీసుకురండి: డీఎస్పీ

క్వారీ వద్ద వివాదం సమాచారం రాగానే పోలీసులు వెళ్లి ఎలాంటి గొడవలు జరగకుండా చూశారని డీఎస్పీ విష్ణురఘువీర్ మీడియాకు చెప్పారు. క్వారీ వారిదైతే ఇంతకాలం ఎందుకు అడగలేదన్నారు. వాళ్లకు హక్కు ఉందనే రికార్డులుంటే కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకోవాలని, పోలీసుల రక్షణ కోరాలని ఆయన సూచించారు. చిన్నసంఘటన పెద్దది అవుతుందని, రాజకీయపార్టీలు రోడ్లపైకి వస్తారని, దీంతో అందరికీ చెడ్డపేరు వస్తుందన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారని, ఎక్కడ చిన్న సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

నామినేటెడ్ పదవులకు పలువురి రాజీనామా


రాజీనామా చేస్తున్న ఎంబీ కుమార్ రాజా

బంగారుపాళ్యం, జూన్ 6: రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ ఎంబీ కుమార్ రాజా గురువారం తన పదవికి రాజీనామా చేశారు. ఈయనతో పాటు రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్లప్ప, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలేశ్వర్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమర్‌నాథ్ తమ రాజీనామాలను బీసీ వెల్ఫేర్ చీఫ్ సెక్రటరీకి పంపినట్లు తెలిపారు.

జానపద కళల అకాడమీ చైర్మన్ కూడా..

పుంగనూరు: పుంగనూరుకు చెందిన రాష్ట్ర జానపదకళల అకాడమీ చైర్మన్ కె.నాగభూషణం గురువారం తన పదవికి రాజీనామా చేశారు. రెండు పర్యాయాలు ఈపదవిలో కొనసాగిన ఆయన.. వైసీపీ అధికారం కోల్పోవడంతో రాజీనామా చేశారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవికి రహంతుల్లా అలియాస్ అమ్ము, ముడా చైర్మన్ పదవికి ఎన్.వెంకటరెడ్డి యాదవ్ కూడా రాజీనామాలు చేశారు.

టీడీపీ వారిపై వైసీపీ శ్రేణుల దాడి


చికిత్స పొందుతున్న శీనప్ప

కుప్పం, జూన్ 6: గుడుపల్లె మండలంలో టీడీపీ కార్యకర్త, అతడ కోడలిపై వైసీపీ శ్రేణులు గురువారం దాడిచేసి గాయపరిచారు. బాధితుల కథనం మేరకు... సోడిగానిపల్లె పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త శీనప్ప, ఆయన కోడలు కవితపై గురువారం వైసీపీ కార్యకర్తలు అకారణంగా దాడిచేసి తీవ్రంగా కొట్టారు. గాయాల పాలైన వీరిద్దరినీ బంధువులు చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్న శీనప్పను టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, సభ్యులు కన్నన్, మునస్వామిలు పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, దాడికి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

టీడీపీ నేతలపై దాడిలో ఆరుగురిపై కేసు నమోదు

బైరెడ్డిపల్లె, జూన్ 6: బైరెడ్డిపల్లె మండలం పాతపేటలో మంగళవారం రాత్రి విజయోత్సవాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులపై దాడికి పాల్పడిన వైసీపీకి చెందిన సర్పంచి మమత, ఆమె భర్త రవిచంద్రతో పాటు మరో నలుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు అజిత్‌కుమార్, రాజేష్‌ను వైసీపీకి చెందిన రవిచంద్ర అడ్డగించి దూషించి దాడిచేసినట్లు చెప్పారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళుతున్న టీడీపీ నేత సుబ్రమణ్యంశెట్టిపై కూడా రవిచంద్ర దాడిచేసి గాయపరిచారన్నారు. ఈ మేరకు సుబ్రమణ్యంశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీసీ విద్యార్థినికి ఎస్సీ సర్టిఫికెట్

- దరఖాస్తు చేయకున్నా జారీ చేసిన పుంగనూరు తహసీల్దారు
- రద్దు చేసి విచారించాలంటూ విద్యార్థిని తండ్రి ఫిర్యాదు


COMMUNITY, NATIVITY & DATE OF BIRTH CERTIFICATE



రమ్యసాయికి తహసీల్దారు మంజూరు చేసిన ఎస్సీ కులధృవీకరణ పత్రం - రమ్యసాయి బీసీ కులానికి చెందినదిగా పేర్కొన్న పాఠశాల టీసీ

పుంగనూరు, జూన్ 6: కుల ధ్రువీకరణ పత్రం కావాలని వాళ్లు దరఖాస్తు చేయలేదు. కానీ, బీసీ కులానికి చెందిన విద్యార్థినికి ఎస్సీ కులధ్రువీకరణ పత్రాన్ని పుంగనూరు తహసీల్దార్ జారీ చేశారు. తప్పుడు సర్టిఫికెట్ మంజూరుపై విచారించి.. రద్దు చేయాలని విదార్థిని తండ్రి, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ కార్యదర్శి ఎం.శ్రీకాంత్ అధకారులను కోరారు. ఈ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. పుంగనూరు కుమ్మరవీధికి చెందిన ఎం.శ్రీకాంత్ కుమార్తె ఎం.రమ్య సాయి ఉన్నత చదువుల కోసం అగముడియన్ (మొదలియార్ బీసీ-డీ) కులం సర్టిఫికెట్ మంజూరు చేయాలని గురువారం స్థానిక 5వ వార్డు సచివాలయంలో దరఖాస్తు చేశారు. అక్కడి సిబ్బంది వీరికి నివ్వెరపోయే సమాధానం ఇచ్చారు. 2023 మార్చి 5వ తేది పుంగనూరు తహసీల్దార్ టీ.సీతారాం ఎం.రమ్యసాయి స్థానిక మేలుపట్లలో ఇంటినెంబరు 27/57/18లో కాపురమున్నట్లు, వారు అరవమాల ఎస్సీ-సీ కులానికి చెందినవారిగా.. 2007 మే 1వతేదీ జన్మించినట్లు 1వ సచివాలయంలో సర్టిఫికెట్ మంజూరైనట్లు పేర్కొన్నారు. అయితే శ్రీకాంత్ రెండో కుమార్తె రమ్యసాయి జన్మదినం 2002 జనవరి 25, కులం బీసీ-డీగా స్కూల్ సర్టిఫికెట్ చూపి వెంటనే తన కుమార్తె కులధృవీకరణ పత్రం ఎస్సీ-సీని రద్దు చేసి బీసీ-డీగా ఇవ్వాలని తహసీల్దార్ శివయ్యకు ఫిర్యాదు చేశారు. రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని ఏదైనా ఉద్దేశ్యపూర్వకంగా చేశారా, లేక పొరబాటు జరిగిందా అనే విషయంపై విచారించి తప్పును సరిదిద్దాలని కోరారు.

ఆగని గజదాడులు


పంట నష్టాన్ని చూపుతున్నరైతు వేముల ప్రకాశ్

సదుం, జూన్ 6: సదుం మండల పరిధిలోని అటవీ శివారు ప్రాంతాల్లో ఆగని గజరాజుల సంచారంతో వాటిల్లుతున్న పంట నష్టంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి చెరుకువారిపల్లె పంచాయతీ పోతంవారిపల్లె సమీపంలోని వేముల ప్రకాశ్‌కు చెందిన టమోటా పంట పొలాలపై ఏనుగులు సంచరించాయి. ఆ పంటను తొక్కి వేసి కోతకొచ్చిన పంటను నాశనం చేశాయి. ఫారెస్టు బీట్ అఫీసర్ మహేశ్, నలుగురు ట్రాకర్ల సాయంతో సంఘటనా స్థలానికి వెళ్లి పంట నష్టాన్ని పరిశీలించారు. గజరాజుల అడుగు జాడలు గుర్తిస్తూ బంగారు చింత అడవి వైపుగా వాటిని దారి మళ్లించే ప్రయత్నం చేశారు. అటవీ శివారు ప్రాంతాల్లో పంట పొలాలాపై తరచూ ఏనుగుల దాడులు తీరనిసమస్యగా మారిందని రైతులువాపోతున్నారు.

రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లో తనిఖీలు


బొమ్మసముద్రం రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న సీఆర్ఎస్ మాధవి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 6: రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లో గురువారం దక్షిణ మధ్య రైల్వే చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ మాధవి పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. రేణిగుంటలో ఉదయం బయల్దేరి తిరుపతి, పాకాల, చిత్తూరు మీదుగా దక్షిణ మధ్య రైల్వే సరిహద్దులో ఉన్న బొమ్మసముద్రం స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. స్టేషన్ మాస్టర్ కార్యాలయంలో రైళ్ల రాకపోకలు, భద్రత అంశాలను ఆమె తనిఖీ చేశారు. అనంతరం పాకాల రైల్వే యార్డ్‌లోని 62వ ఎల్‌సీ గేటు నిర్వహణ తీరును పరిశీలించి, ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ముంగిలపట్టు-చంద్రగిరి రైల్వే స్టేషన్‌ల మధ్య వున్న వంతెనను తనిఖీ చేసిన అనంతరం తిరుపతి చేరుకున్నారు. శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని యార్డును పరిశీలిస్తారు. అనంతరం సికింద్రాబాద్ వెళతారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ డివిజన్ అధికారులు సుధాకర్, లక్ష్మీనాయక్, సూర్యనారాయణ, చంద్రశేఖర్, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, సురేష్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

భానుపై దాడుల ఫలితమేనా భారీ ఆధిక్యత?

- రోజా ఓటమే లక్ష్యంగా కసితీరా పనిచేసిన టీడీపీ కేడర్


భానుప్రకాష్‌పై దాడికి పుత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ కేడర్‌ను అదుపు చేస్తున్న పోలీసులు (ఫైల్ ఫొటో)

పుత్తూరు అర్బన్, జూన్ 6: ఐదేళ్లు... నియోజకవర్గంలో రూల్ ఆఫ్ లాకు పాతరేశారు.... పోలీసు స్టేషన్లను అధికార పార్టీకి గెస్ట్ హౌస్‌లుగా మార్చుకున్నారు... ఏకంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌పై భౌతిక దాడికి పాల్పడే స్థాయికి బరితెగించారు... ఫిర్యాదు చేస్తే తిరిగి రివర్స్ కేసులతో వేధించారు. దౌర్జన్యాలు, దాడులతో అరాచకాన్ని సృష్టించారు. దీంతో కడుపు రగిలిన టీడీపీ కేడర్ రోజా ఓటమికి కసితీరా పనిచేశారు. దీని ఫలితమే రికార్డు మెజార్టీ అని భావిస్తున్నారు.

రోజా ఓటమికి తొలి నాంది

గతేడాది అక్టోబర్‌లో నగరి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గాలి భానుప్రకాష్‌ను వైసీపీ కార్యకర్తలు కర్రలు, రాడ్లతో అడ్డగించారు. భౌతికదాడికి యత్నించారు. ఈ క్రమంలో కారు ధ్వంసమైంది.డ్రైవర్ విక్షణతో వ్యవహరించడంతో ఆయన తప్పించుకున్నారు. దీంతో టీడీపీ కేడర్ అప్పటికప్పుడు భానుప్రకాష్‌కు మద్దతుగా నగరి వచ్చి భారీ ర్యాలీతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు తిరిగి ఆయనపైనే కేసు నమోదు చేశారు. దీనిపై పుత్తూరులో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. లాఠీలతో విరుచుకుపడ్డారు.

ఏకంగా 13 కేసులు

2019లో అధికారంలోకి వచ్చాక వైసీపీ కన్నుమిన్ను కానరాకుండా ప్రవర్తించింది. భానుప్రకాష్ టార్గెట్‌గా పోలీసు కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేంది. ఈ ఐదేళ్లలో పుత్తూరు, నగరి పరిధిలో 13 కేసులు నమోదు చేయించింది. ఎన్నికలయ్యాక కూడా పుత్తూరులో కేసు నమోదు చేశారంటే పోలీసు అధికారుల ఏకపక్ష తీరుతెలుస్తోంది. గతేడాది చంద్రబాబునాయుడు అరెస్ట్ సందర్భంగా నిరసన తెలిపేందుకు కూడా అనుమతివ్వలేదు. తిరుపతి నుంచి పుత్తూరుకు చేరుకునేందుకు నానా అవస్థలూ పడ్డారు.

కసి తీరా పనిచేసిన కేడర్

వరుసగా కార్యకర్తలు, నాయకులతో పాటు గాలి భానుప్రకాష్‌పై కూడా కేసులు, అణచివేతలతో వ్యవహరించిన రోజాను ఓడించేందుకు కేడర్ ప్రతిజ్ఞ పూనేలా చేసింది. శషభిషాలను పక్కన పెట్టారు. వైసీపీ కేడర్‌ను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేసి సఫలమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ మొదలైనప్పటి నుంచి తామే అభ్యర్థి అనేలా కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల రోజుకు ముందు కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్, బూత్ మేనేజ్‌మెంట్‌లో శ్రమించి పనిచేశారు. ఫలితంగా నియోజకవర్గ చరిత్రలో ఇప్పటి వరకు లేని విధంగా 45,004 ఓట్ల మెజార్టీ సాధించడంలో కీలకపాత్ర పోషించారు. అధికారం తెచ్చిన అహంకారంతో విచ్చలవిడిగా ప్రవర్తించిన వైసీపీ శ్రేణులు, ఎమ్మెల్యే అభ్యర్థి రోజా భారీ మూల్యమే చెల్లించిందనే మాటలు వినబడుతున్నాయి.

తప్పుకుంటే సరి.. లేదంటే వేటే !

- డీసీసీబీ, సీడీసీఎంఎస్ కమిటీలకు త్వరలో మంగళం
- ఐదేళ్లుగా ఎన్నికలు లేకనే కొనసాగుతున్న పాలకవర్గాలు
- నెలాఖరుతో ముగియనున్న విండోల త్రిసభ్య కమిటీల పదవీకాలం



రెడ్డెమ్మ - నాగలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 6: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 76 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (సింగిల్ విండో)ల నామినేటెడ్ త్రిసభ్య కమిటీల గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)ల సెవెన్‌మెన్ కమిటీలకు వచ్చే నెల 17తో నామినేటెడ్ పదవీకాలం పూర్తికానుంది. కమిటీల పేరిట తన పార్టీ వారికే పదవులు అంటగట్టి ఆరునెలలకోసారి పొడిగిస్తూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పాలకవర్గాల ఎన్నికల ఊసే లేకుండా చేసింది. కొత్త ప్రభుత్వం కొలువుతీరి వేటు వేసేలోగా ఈ కమిటీలు వెంటనే తప్పుకుంటే గౌరవంగా ఉంటుందని రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వర్గానికి చెందిన ఎం.రెడ్డెమ్మ డీసీసీబీ సెవెన్‌మెన్ నామినేటెడ్ కమిటీకి... సీడీసీఎంఎస్‌కు ఎస్.నాగలక్ష్మి చైర్‌పర్సన్లుగా కొనసాగుతున్నారు. ఇదేవిధంగా 76 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీ చైర్మన్లుగా, ఇద్దరు సభ్యులుగా వున్న 228 మంది వైసీపీ మండలస్థాయి నేతలే ఉన్నారు. ప్రస్తుతం వీరి హయాంలో ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేశారు. కోట్లాది రూపాయలు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. రుణాల పేరిట తమ పార్టీ వారికి నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక నిధులు మంజూరు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

ఎన్నికలకు ఎందుకు వెళ్ళలేదో...?

2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగియడంతో వాటి గడువును ఒక ఏడాది పొడిగించింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికల జోలికి వెళ్లకుండా సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలు, డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు సెవెన్‌మెన్ కమిటీలు వేసి, వాటి గడువును ప్రతి ఆరునెలలకోసారి పొడిగిస్తూ వచ్చింది. ఎన్నికలు జరగకపోవడంతో మూడు లక్షల మంది రైతుసభ్యులు ఓటువేసే హక్కు కోల్పోయారు. ఐదేళ్ల కాలంలో పాలకవర్గాలు లేని సహకార సంఘాలుగా అవి నిలిచాయి.

వెనుకబడ్డ సంఘాలు

సింగిల్ విండోలు, సీడీసీఎంఎస్, డీసీసీబీ పాలకవర్గాలు ఎన్నికైఉంటే ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించి రుణపరపతి పెంచుతూ బ్యాంకుల్లో డిపాజిట్లు ఎలా చేయాలి? రైతులకు సహకార సంఘాల ద్వారా ఎలా చేయూతనివ్వాలి? ఆదాయం ఎలా పెంచాలనే నిర్ణయాలు తీసుకునేది. అవేవీ లేకుండానే ఐదేళ్లలో కమిటీతో చేయూతనిచ్చే సహకార సంఘాలకు ఊతమే లేకపోయింది. అన్నింటిలాగే సహకార సంఘాలనూ వైసీపీ ప్రభుత్వం ముంచేసింది. ఐదేళ్లలో సహకార సంఘాలు రైతులకు సహకారం అంతంతగానే ఉండడంతో పాటు సంఘాలూ అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయాయి.

చంద్రబాబుకు శ్రీవారి ప్రసాదాలు



చంద్రగిరి, జూన్ 6: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును చంద్రగిరి మండలానికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పీరపల్లి హేమాంబరధర రావు గురువారం ఉండవల్లిలోని ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎన్నికల కురుక్షేత్రంలో మరెవ్వరికీ సాధ్యం కాని అద్భుత విజయం సాధించి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీవారి ఆలయం మీదుగా విమానం


ఆలయంపై వెళుతున్న విమానం

తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం మీదుగా మరోసారి విమానం ప్రయాణించడం విమర్శలకు దారితీసింది. శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన ఆలయంపై విమానాలు ప్రయాణించడం ఆగమశాస్త్ర విరుద్ధం. ఈ అంశంపై ఇప్పటికే అర్చకులు పలుమార్లు చెప్పినప్పటికీ తిరుమల క్షేత్రం మీదుగా తరచూ విమానాలు ప్రయాణిస్తూనే ఉన్నాయి. గురువారం ఉదయం 8.15 గంటలకు ఓ విమానం క్షేత్రం మీదుగా ప్రయాణించింది. భక్తుల మనోభావాలు దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా అధికారులు విమానాలు ప్రయాణించకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు. కేంద్రంతో మరోసారి ఈ అంశంపై చర్చించి విమానాలు తిరుమల క్షేత్రంపై రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళను కట్టేసి దోపిడీ

వెంటాడి దుండగుల్లో ఒకడిని పట్టుకున్న గ్రామస్తులు ● 40 గ్రాముల చైను, రూ.1.3 లక్షల నగదు అపహరణ



బాధితురాలు షర్మిల - పోలీసుల అదుపులో నిందితుడు

శాంతిపురం, జూన్ 6: ఒంటరి ఇంట్లోకి ఆరుగురు దుండగులు చొరబడ్డారు. మహిళపై దాడిచేసి.. కాళ్లు చేతులు కట్టేసి మెడలోని బంగారు చైను, రూ.1.3 లక్షల నగదు, ఒక ద్విచక్రవాహనం తీసుకెళ్లారు. గ్రామస్తులు వెంటాడటంతో ఒక దుండుగుడు దొరికాడు. శాంతిపురం మండలం తోపుచేను గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితరాలు షర్మిల తెలిపిన ప్రకారం.. తోపుచేను గ్రామానికి చెందిన యువరాజు అలియాస్ పళని తమ పొలాల వద్ద ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా యువరాజు సింగపూరులో ఉన్నారు. ఆయన భార్య షర్మిల, కుమార్తెలు కావ్య, మనుప్రియ, కుమారుడు తనీష్ ఇంట్లో ఉంటున్నారు. పెద్ద కుమార్తె ఉద్యోగరీత్యా బెంగుళూరులో ఉండగా, మరో కుమార్తె తమిళనాడులోను, కుమారుడు తిరుపతిలో చదువుతున్నారు. కళాశాలలకు సెలవులు కావడంతో వాళ్లు ఇంటికి వచ్చారు. ఎప్పటిలాగే ఇంటి ప్రహరీ గేటుకు తాళాలువేసి ద్విచక్రవాహనం తాళాలను అందులోనే ఉంచి బయట పెట్టారు. తనీష్ మిద్దెపైన గదిలో ఉన్నారు. అర్ధరాత్రి తలుపు తట్టిన శబ్దం వినపడటంతో తనీష్ అనుకొని షర్మిల తలుపులు తీశారు. ముఖానికి ముసుగులు, చేతులకు గ్లౌజులు ధరించిన ఆరుగురు దుండుగులు ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడ్డారు. ఆమె మెడ పట్టుకుని నోట్లో గుడ్డ కుక్కి కాళ్ళు చేతులు కట్టేశారు. వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసిన ఆమెపై దాడి చేశారు. కత్తులు, రాడ్లతో బెదిరించారు. ఆమె మెడలోని 40 గ్రాముల బంగారు చైను, తాళి బొట్టు లాక్కొన్నారు. బీరువాలోని రూ.1.30 లక్షల నగదు తీసుకున్నారు. దుండగులు చేస్తున్న శబ్దానికి రూములో నిద్రిస్తున్న మనుప్రియ లేచి చూశారు. దుండగులను చూసి భయంతో గదిలోకి వెళ్లి లాక్ చేసుకున్నారు. దుండగులు కూడా ఆమె గది బయట గడిపెట్టారు. వెంటనే ఆమె మిద్దెపైన ఉన్న తనీష్‌కు ఫోను చేశారు. అతడు కిందికి వచ్చేసరికి వారి ద్విచక్రవాహనాలతో పాటు షర్మిల స్కూటీని తీసుకుని దుండగులు పరారయ్యారు. ఇంట్లో దొంగలు పడ్డారంటూ తనీష్ గట్టిగా కేకలు వేశారు. రాళ్లబూదుగూరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఇతడు కేకలు విన్న చుట్టుపక్కల బంధువులు, గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. వీరంతా ద్విచక్ర వాహనాల్లో దుండగులను వెంబడించారు. కొంత దూరం వెళ్లిన దుండగులు తలా ఒక దిక్కున వెళ్లిపోయారు. గ్రామస్తులూ అన్నివైపులా వెళ్లారు. ఆరుగురు దుండగుల్లో ఒక్కడు దండికుప్పం సబ్ స్టేషన్ వద్ద పట్టుబడ్డాడు. రాళ్లబూదుగూరు ఎస్ఐ సుమన్ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దుండగుడి వద్ద బ్యాగులోని పెద్ద పెద్ద రాడ్లు, కత్తులు, బీరువాలు, తలుపులు తెరిచే రాడ్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిని తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దుండగుల దాడిలో గాయపడిన షర్మిలను ఆస్పత్రికి తరలించారు. గురువారం కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐ సుమన్ తమ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సాయంత్రం చిత్తూరు క్లూస్ టీం వెళ్లి వివరాలు సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తుమ్మలగుంట చెరువులో హడావుడి నిర్మాణాలు

ఎన్జీటీ అభ్యంతరాలున్నా మారని తీరు



తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట చెరువులో హడావుడిగా నిర్మాణాలు జరుగుతుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏవియేషన్ అనుమతులు లేకుండా చెరువులో నెలరోజుల క్రితం భారీ ఎత్తున ఏర్పాటు చేసిన జాతీయ పతాకం కోసం ఐప్యాక్ టీం హెడ్ చేతుల మీదుగా భూమిపూజ చేశారని విమర్శలు వచ్చాయి. ఈనేపథ్యంలో పతాకాన్ని తీసి.. పక్కన పెట్టినట్టు తెలిసింది. అయితే ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పతాక స్తంభం చుట్టూ నిర్మాణాలు జరుగుతున్నాయి. తుమ్మలగుంట చెరువు అన్యాక్రాంతమవుతోందని పలువురు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఒకవైపు ఎన్జీటీ అభ్యంతరాలు, మరోవైపు కొత్త ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలోనూ తుమ్మలగుంట చెరువులో మాత్రం నిర్మాణాలు మాత్రం ఆగక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

31 మండలాల్లో భారీ వర్షం


జలమయమైన చిత్తూరు నగరంలోని పలమనేరు రోడ్డు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 6: జిల్లావ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు రామకుప్పం మినహా మిగిలిన 31 మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. రొంపిచెర్లలో 41.4మి.మీ., యాదమరి 35.0, చిత్తూరు అర్బన్ 34.0, చౌడేపల్లె 30.2, బంగారుపాళ్యం 27.2, బైరెడ్డిపల్లె 26.8, చిత్తూరు రూరల్ 26.2, పాలసముద్రం 22.6, గంగాధరనెల్లూరు 20.0, తవణంపల్లె 18.6, పెద్దపంజాణి 18.4, వెదురుకుప్పం 17.2, నింద్ర 15.2, గుడుపల్లి 15.2, సోమల 14.2, గంగవరం 13.4, కార్వేటినగరం 13.2, పలమనేరు 11.6, పూతలపట్టు 10.5, గుడిపాల 9.8, కుప్పం 8.4, ఐరాల 8.2, సదుం 7.2, నగరి 6.8, పుంగనూరు 6.2, విజయపురం 3.2, పెనుమూరు 2.2, శాంతిపురం 2.2, శ్రీరంగరాజపురం 2.0, వి.కోట 2.0, పులిచెర్లలో 1.0 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

చిత్తూరు కల్చరల్: చిత్తూరు నగరంలో గురువారం మధ్యాహ్నం 3.45నుంచి 5.30 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. కలెక్టరేట్ ప్రధాన భవనం ముందు లాన్‌లో నీరు చేరింది. నీవానదిలోని లోతట్టు ప్రాంతాలకు నీళ్ల ప్రవహించడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. గిరింపేట వళ్లియప్పనగర్, ఓటి చెరువు, కృష్ణానగర్ ప్రాంతాల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహించింది. దొడిపల్లె షుగర్ ఫ్యాక్టరీ ఫ్లైవోవర్ పైన, కింద నడుములోతు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

కాణిపాకంలో వాన

ఐరాల(కాణిపాకం): కాణిపాకంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. స్వామి దర్శనం చేసుకున్న భక్తులు బస్టాండుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. కొందరు దుకాణాలు, అన్నదానం సత్రం వద్ద తలదాచుకున్నారు.

తిరుపతిలో సీఈవో


ముఖేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అయనకు స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేశారు. శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా ముఖేష్‌కుమార్‌మీనా తిరుమల శ్రీవారిని దర్శించుకుని విజయవాడకు తిరుగుప్రయాణం కానున్నారని జిల్లా అధికారులు తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కుప్పం మున్సిపాలిటీలో చంద్రబాబుకు 12 వేల మెజారిటీ



ధన్యవాదాలు తెలుపుతున్న రాజ్‌కుమార్

కుప్పం, జూన్ 6: కుప్పం పురపాలక సంఘం పరిధిలో టీడీపీ అధినేత చంద్ర బాబుకు ఏకంగా 12 వేల మెజారిటీ లభించింది. మొత్తం మెజారిటీ 48,006 ఓట్లలో అత్యధిక మెజారిటీ సాధించిన మున్సిపాలిటీ కుప్పం నియోజక వర్గంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. మున్సిపాలిటీ పరిధిలో 40 పోలింగ్ బూత్‌లు ఉండగా 66 శాతం ఓట్లను సాధించింది. అలాగే కుప్పం రూరల్‌లో 60 బూత్‌లు ఉండగా 13,160 ఓట్ల మెజారిటీ సాధించి 60 శాతం ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. తర్వాత గుడుపల్లె మండలం 9,945, శాంతిపురం మండలం 6,338, రామకుప్పం మండలం 6,318 ఓట్ల మెజారిటీతో వరుసగా మూడవ, నాల్గవ, ఐదు స్థానాలలో నిలిచాయి. కాగా నియోజకవర్గంలోనే అత్యధిక మెజారిటీ ఇచ్చిన కుప్పం మున్సిపల్ ప్రజలకు టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి మెజారిటీ కట్టబెట్టిన మున్సిపల్ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. వారి సాదక బాధకాల్లో వెంట ఉండి, సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

వీఆర్వోపై పోలీసులకు ఫిర్యాదు

పెద్దపంజాణి, జూన్ 6: పెద్దపంజాణి మండలం కోగిలేరు పంచాయతీ వీఆర్వోగా పని చేస్తున్న సుధాకర్‌పై మాజీ ఎంపీపీ మురళీకృష్ణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బసవరాజుకండ్రిగకు చెందిన ఓ విద్యార్థి ఆదాయ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని వీఆర్వోను కోరితే దుర్భాషలాడారు. దీంతో ఎంపీపీ పోలీసులను ఫిర్యాదు చేశారు. గతంలో సైతం ఓ రెవెన్యూ సమస్యపై తనను ఇలాగే దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పుస్తకం..ఓ మంచి నేస్తం



పిల్లలకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రముఖులు

కుప్పం, జూన్ 6: పుస్తకమనేది ఒక మంచి నేస్తం వంటిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గత నెల 15వ తేదీ నుంచి ఈనెల 5వ తేదీదాకా పిల్లలకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా కుప్పం శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయాధికారి సత్యవాణి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. రామకోటి రాయడం, తెలుగు కాపీ రైటింగ్, తెలుగు లేఖనం, పజిల్స్, కలరింగ్ వంటివి వేసవి శిక్షణా శిబిరంలో పిల్లలకు నేర్పించినట్లు గ్రంథాలయాధికారి తెలిపారు. తద్వారా పిల్లలలో సృజనాత్మక శక్తితోపాటు పఠనాసక్తి పెరుగుతుందని చెప్పారు. అలాగే శిక్షణలో భాగంగా శిబిరంలో పాల్గొన్న పిల్లలకు వ్యాసరచన, కథ చదివి రాయడం, రామాయణ శ్లోకాలు, డ్రాయింగ్, వర్డ్ సెర్చ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తోపాటు పలువురు పట్టణ ప్రముఖులు, పిల్లలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల వితరణ



కుప్పం, జూన్ 6: కుప్పంలోని చిరు వ్యాపారులకు బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్, కుప్పం లయన్స్ క్లబ్, ఆధ్వర్యంలో గురువారం గొడుగులను వితరణ చేశారు. 20 గొడుగులను పేదలైన చిరు వ్యాపారులకు అందించినట్లు కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ ఎ.మహేశ్‌లు తెలిపారు. లయన్స్ క్లబ్ సభ్యులు ప్రసాద్, పీజీ.సెల్వం, సెంథిల్, సుబ్రహ్మణ్యం, చరణ్, లెనిన్, కేఈసీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై దాడులు ఆపాలి: చల్లాబాబు



రొంపిచెర్లలో కార్యకర్తలతో చల్లాబాబు

రొంపిచెర్ల,జూన్6: పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడులు ఆపకుంటే చర్యలు తప్పవని టీడీపీ నాయకుడు చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం రొంపిచెర్లలో ఆయన నివాసం వద్ద పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చల్లా బాబును కలిశారు. 6వేల ఓట్లతో ఓటమి చెందడం కలచి వేసిందని విలపించారు. ఈ సందర్భంగా చల్లాబాబు మాట్లాడుతూ కూటమి ఘనవిజయాన్ని జీర్ణించుకోలేని వైసీపీ కార్యకర్త పుంగనూరులో టీడీపీ కార్యకర్త షామీర్‌ను బుల్లెట్‌తో ఢీకొట్టడం గర్హనీయమన్నారు. అలాంటి దాడులు పునరావృతం అయితే తగిన గుణపాఠం చెబు తామని హెచ్చరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతుందని వివరించారు.

టీడీపీ నేతలకు అభినందనల వెల్లువ



టీడీపీ నేతలను సన్మానిస్తున్న పార్టీశ్రేణులు

బైరెడ్డిపల్లె, జూన్ 6: జరిగిన ఎన్నికల్లో టీడీపీ భారీ విజయం సాధించి అధికారంలోకి రావడంతో పార్టీశ్రేణుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇందులో భాగంగా గురువారం టీడీపీ మండలాధ్యక్షుడు, కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ రాధమ్మను మండలంలోని వివిధ పంచాయతీలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. రెండు రోజులుగా టీడీపీ ముఖ్యనేతలకు అభినందనల వెల్లువ కొనసాగుతూనే వుంది. టీడీపీ విజయం కోసం అహర్నిశలు కృషిచేసిన ప్రతిఒక్కరికీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

నారా లోకేశ్‌ను కలిసిన అమర్



గంగవరం, జూన్6: కూటమి అఖండ విజయం తరువాత తొలి సారిగా పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలసి శుభా కాంక్షలు తెలియజేశారు. గురువారం విజయవాడలోని ఆయన నివాసంలో కలిశారు. జిల్లాలో విజయం సాధించిన తీరుపై ఇద్దరూ చర్చించి సంతోషం వ్యక్తం చేశారు. పార్టీకోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులందరికీ ఎప్పుడూ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

గంగమ్మకు విశేష పూజలు



గుడుపల్లె, జూన్ 6: మండలంలోని అంజనాద్రి గ్రామంలో కొలువైన గంగమ్మ ఆలయంలో గురువారం గంగమ్మకు విశేష పూజలు జరిగాయి. ఉదయం గంగమ్మకు ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మహిళలు ఫల, పుష్ప తాంబూలాలతో ఆలయానికి చేరుకొని కొబ్బరి కాయలు కొట్టారు. కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

మాజీ ఎమ్మెల్సీ సోదరుడి మృతి



నివాళులు అర్పిస్తున్న అమర్ సతీమణి

పెద్దపంజాణి, జూన్ 6: మాజీ ఎమ్మెల్సీ రెడ్డెప్పరెడ్డి, మాజీ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి(58) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. ఎమ్మెల్యే అమర నాథరెడ్డి సతీమణి రేణికారెడ్డి గురువారం గోనుమాకులపల్లెకు వెళ్లి ఆయనకు నివాళులర్పిం చారు. పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలలోని పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

విద్యుత్ తీగలు తగిలి యువతికి తీవ్రగాయాలు

రామకుప్పం, జూన్ 6: విద్యుత్ తీగలు తగిలి ఓ యువతి గాయాలపాలైంది. స్థానికులు కథనం మేరకు.. మండలంలోని చెల్దిగానిపల్లెకు చెందిన అమరావతి కుమార్తె సౌమ్య(20) గురువారం మధ్యాహ్నం గొర్రెపిల్లను తీసుకుని గ్రామ సమీపంలోని పొలం వద్దకు వెళ్లింది. ఓ చోట దాన్ని తాడు కట్టేసింది. కొంతసేపటి తర్వాత అది తాడు తెంచుకుని వెళ్తుండగా సౌమ్య దాన్ని పట్టుకునేందుకు పరుగెత్తింది. ఈ క్రమంలో అక్కడ చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు ఆమెకు తగిలి షాక్‌కు గురైంది. తీవ్ర గాయాలపాలైంది. స్థానికులు గుర్తించి కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఘటన జరిగిన ప్రాంతంలో ఏడాదికి పైగా విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉన్నాయి. ఈ విషయమై పత్రికల్లో కథనాలు వచ్చినా సంబంధిత అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. ఇకనైనా వైర్లు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాటగంగమ్మకు అమావాస్య పూజలు



విశేషాలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె, జూన్ 6 : బైరెడ్డిపల్లెలో వెలసిన బాటగంగమ్మ ఆలయంలో గురువారం అమావాస్య ప్రత్యేకపూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు నాగేంద్ర అమ్మవారికి అభిషేకంచేసి విశేషాలంకరణతో పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ కృష్ణవేణిజైకుమార్ కుటుంబీకులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఆలయంవద్ద అన్నదానం చేశారు.

బైరెడ్డిపల్లెలో టీడీపీకి బంపర్ మెజారిటీ

బైరెడ్డిపల్లె, జూన్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో బైరెడ్డిపల్లె మండలంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల సమష్టి కృషితో టీడీపీ 4,119 మెజారిటీ సాధించింది. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి ఆధ్వర్యంలో మండలంలోని అందరు నాయకులు, కార్యకర్తలు శాయశక్తులా పార్టీ గెలుపుకోసం కృషిచేయడంతో నియోజకవర్గంలోనే బైరెడ్డిపల్లె మండలంలో టీడీపీకి బంపర్ మెజారిటీ లభించింది. గత ఎన్నికల్లో మండలంలో వైసీపీకి మెజారిటీ రావడంతో ఈసారి ఎలాగైనా టీడీపీ సత్తాచాటాలని పార్టీశ్రేణులు పట్టుదలతో సైని కుల్లా పనిచేశారు. ఆ మేరకు ఎన్నికల్లో టీడీపీ విజయదుందుభి మోగించడంతో పార్టీశ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

వైసీపీ విధ్వంసానికి గుణపాఠం ఈ తీర్పు

- కుప్పంలో ఆగిన అభివృద్ధి పనులన్నీ త్వరలోనే మొదలు
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ఎం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎం

కుప్పం, జూన్ 6: కుప్పంలో ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ సాగించిన విధ్వంసానికి ప్రజలు ఇచ్చిన తీర్పు సరైన గుణపాఠమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలో కక్షసాధింపు వల్ల ఆగిన పనులన్నీ త్వరలోనే తిరిగి మొదలవుతాయని హామీ ఇచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో, ఇటు కుప్పంలో కూడా ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని చేయకుండా సమస్యలను సృష్టించి మరీ వెళ్లిపోయిందని విమర్శించారు. గత ఐదేళ్లుగా కుప్పంపై కక్ష సాధింపుతో కనీసమైన అభివృద్ధి పనులు చేయలేదని, పైగా దాడులు, దౌర్జన్యాలతో ఇక్కడి శాంతిభద్రతలను ఘోరంగా దెబ్బ తీశారని ధ్వజమెత్తారు. ఆగిన పనులతోపాటు అదనంగా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు మంజూరై త్వరలోనే ప్రారంభానికి నోచుకుంటాయని హామీ ఇచ్చారు. అరాచకాలు చేయడం వైసీపీ సంస్కృతి అని, అది తప్ప ఆ పార్టీ నేతలకు మరేమీ తెలియదని విమర్శించారు. టీడీపీకి అటువంటి అరాచకాలు, దౌర్జన్యాలు తెలియవన్నారు. వైసీపీ సాగించిన అరాచకాలకు బదులు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఒకవైపు సంక్షేమం, రెండవ వైపు అభివృద్ధి ఏక కాలంలో జరుగుతాయని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సత్యేంద్రశేఖర్, వీజీ.ప్రతాప్, గోపీనాథ్, శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు



కొండపైన టీడీపీ జెండాతో రాళ్లబూదుగూరు నాయకులు

శాంతిపురం, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో రాళ్లబూదుగూరు పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమిళనాడు తిరుత్తణి సుబ్రమణ్యస్వామికి మొక్కులు చెల్లించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బసవరాజు, ఇతర నాయకులతో కలిసి కూటమి అధికారంలోకి వస్తే తలనీలాలు సమర్పి స్తామని మొక్కుకున్నారు. ఆ మేరకు గురువారం తిరుత్తణిలో తలనీలాలు సమర్పించారు. కొండపై టీడీపీ జెండాను ప్రదర్శించి టీడీపీ జిందాబాద్, చంద్రబాబు జిందాబాద్ అంటు నినాదాలు చేశారు. అలాగే కాణిపాకం, అర్ధగిరి దేవాలయాలలోనూ మొక్కులు తీర్చు కున్నారు. వీరితో పాటు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి నాగరాజు, మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు చలపతి, చిన్నారిదొడ్డి పంచాయతీ పార్టీ అధ్యక్షుడు రఘుపతి కూడా కాణిపాకం ఆలయంలో చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకుల్లో మురళి, సురేష్, నారాయణ, జయరాజ్, ఆనంద, శ్రీనివాసులు, వెంకటేష్, ఆరిన్ ఆనంద, తదితరులు ఉన్నారు.

నీట్‌లో సత్తా చాటిన పులిచెర్ల విద్యార్థి సాత్విక్

- జాతీయ స్థాయిలో 550వ ర్యాంకు



కల్లూరు, జూన్ 6: వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ స్థాయి నీట్- యూజీ 2024 పరీక్షా ఫలితాల్లో పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ పేరావాండ్లపల్లికి చెందిన పేరా సాత్విక్ జాతీయ స్థాయిలో 550 ర్యాంకు సాధించి సత్తా చాటాడు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు పేరా రవీంద్ర, పద్మజ రెండవ కుమారుడు సాత్విక్ 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మంగళంపేట ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించాడు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ విద్యను పూర్తి చేశాడు. 2024లో నిర్వహించిన నీట్ పరీక్షలో 720 మార్కులకు గానూ 710 మార్కులు సాధించి 550 ర్యాంకును సొంతం చేసుకున్నాడు. రవీంద్ర, పద్మజ దంపతుల మొదటి కుమారుడు పేరా ధార్మిక్ 2019 సంవత్సరం నీట్ పరీక్షా ఫలితాల్లో 1131 ర్యాంకు సాధించి మద్రాసు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. నీట్ ఫలితాల్లో సాత్విక్ ప్రతిభ కనబరచడంపై గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

కూటమి ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందిస్తుంది



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రంగనాథ్

వి.కోట, జూన్ 6: టీడీపీ కూటమి ప్రభుత్వం అవినీతి, అరాచక రహిత పాలన అందిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్, జిల్లా అధికారప్రతినిధి రాంబాబులు తెలిపారు. గురువారం వారు వి.కోటలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ రాక్షస పాలనతో విసిగి వేసారిన ప్రజలు టీడీపీ కూటమికి కనీవినీ ఎరుగని భారీ విజయాన్నందించారన్నారు. వారి ఆశలను వమ్ము చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తుందన్నారు. అమరనాథరెడ్డికి ప్రజలు ఘనవిజయం అందించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో నియెజకవర్గంలో ఆగిని అభివృద్ధిని అమరనాథరెడ్డి తిరిగి కొనసాగిస్తారన్నారు. ఈ సమవేశంలో నేతలు ఈశ్వర్, చౌడప్ప, ధీరజ్, శబరీష్, రామ్మూర్తి, నారాయణస్వామి, సతీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సుల్లాపురమ్మకు వైభవంగా పుష్పపల్లకీ సేవ





సల్లాపురెమ్మ పుష్పపల్లకీసేవ, పూలగెరిగెతో కళాకారుడి విన్యాసం

బైరెడ్డిపల్లె, జూన్ 6: బైరెడ్డిపల్లెలోవున్న సల్లాపురమ్మ ఆలయ ఉత్సవాల్లో ప్రధానమైన పుష్పపల్లకీ సేవ బుధవారం అర్ధరాత్రి వైభవంగా జరిగింది. వివిధరకాల పుష్పాలతో సుం దరంగా తీర్చిదిద్దిన పల్లకీలో అమ్మవారి ఉత్సవవిగ్రహాన్ని విశేషాలంకరణతో కొలువుదీర్చారు. అర్చకులు నాగేంద్ర ప్రత్యేకపూజలు చేశారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య ప్రారంభమైన పల్లకీ ఊరేగింపు గురువారం తెల్లవారుజామున ఆలయం వద్దకు చేరుకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పల్లకీ ఊరే గింపులో పూలగెరిగెతో కళాకారుడు ప్రదర్శించిన విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

మహిళపై దాడి కేసు.. ఆరునెలల జైలు

చిత్తూరు లీగల్, జూన్ 6: మహిళపై దాడిచేసిన కేసులో ఐదుగురికి చిత్తూరు న్యాయ స్థానం ఆరునెలల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. బంగారుపాళ్యం మండలం వినాయకపురం గ్రామానికి చెందిన రామయ్య భార్య సుభాషిణిపై అదే గ్రామానికి చెందిన మునిరాజు, మునస్వామి, గణేష్, మోహన్, మీనాక్షిలు 2018 సెప్టెంబరు 26వ తేదీన దాడిచేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంగారుపాళ్యం పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇరువర్గాల వాదన విన్న న్యాయమూర్తి ఉమాదేవి నిందితులకు ఆరునెలల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.1,300 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

ఆకట్టుకున్న ఉత్తర గోగ్రహణం

సోమల, జూన్ 6: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ భారతంమిట్టలో మహాభారత యజ్ఞం సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు జరిపారు. ఉభయదారులు శెట్టివారి శంకరయ్య, అశోక్ ఆధ్వర్యంలో పురోహితులు హోమాది కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భాగవతారణి గీతావాణి ఉత్తర గోగ్రహణం కథను భక్తులకు వివరించారు. రాత్రి నాటకప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది. పలువురు దాతలు మహాభారత యజ్ఞం నిర్వహణకు విరాళాలు అందజేశారు.

సోమలలో ఓ మోస్తరు వర్షం

సోమల, జూన్ 6: సోమల మండలంలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం పగలు సైతం భారీ వర్షం కురవడంతో ఖరీఫ్ సీజన్‌లో దుక్కులు చేసుకునేందుకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. టమోటా, మామిడి రైతుల కోతలు ఆపేశారు. టమోటాకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో వర్షంతో తోటలు దెబ్బతింటాయని మితిమీరిన మందుల పిచికారీ చర్యలు చేపట్టారు.

వైభవంగా శనేశ్వరస్వామి జయంతి



ప్రత్యేక అలంకరణలో శనేశ్వరుడు

పుంగనూరు రూరల్, జూన్ 6: పుంగనూరులో శనేశ్వర స్వామి జయంతి మహోత్సవం సందర్భంగా ఆల యాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పుంగమ్మ చెరువు మొరవ వద్ద వెలసిన శనేశ్వరాలయం, దండు పాళ్యం రోడ్డులో గల ఆలయాల్లో అర్చకులు స్వామివారికి ప్రత్యేకంగా పాలు, పెరుగు, పసుపు, నెయ్యి, తేనె, పసుపు, కుంకుమ, గంధం, విభూది, మంచి నూనెలతో తైలాభిషేకాలు వైభవంగా జరి గాయి. అనంతరం స్వామివార్లను అర్చకులు ప్రత్యేకంగా పూలతో అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. శాస్త్రో క్తంగా వేద మంత్రాల నడుమ హోమాది కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి శనేశ్వరాల యాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించి పూజలు చేశారు. ఉపవాసాలతో వచ్చి భక్తులు తమ కష్టాలు తీరాలని నూనె దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

మారెమ్మకు అమావాస్య పూజలు



పుంగనూరు రూరల్, జూన్ 6: పుంగ నూరు పాత బస్టాండ్ సమీపంలో వెలసిన విరూపాక్షి మారెమ్మకు గురువారం ఆలయ అర్చకులు ఘనంగా అమావాస్య పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు ఆలయాన్ని శుద్ధిచేసి పూలు, మామిడి, వేపాకు తోరణాలతో ముస్తాబు చేశారు. మారెమ్మకు అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా మారెమ్మను మ హంకాళిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉపవాసాలతో మహిళలు, భక్తులు అమ్మవారికి చీరలు, జాకెట్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆరోగ్య పరిరక్షణకు బీసీజీ టీకాలు తప్పని సరి

సోమల, జూన్ 6: ఆరోగ్య పరిరక్షణకు 50 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బీసీజీ టీకాలు వేసుకోవాలని పెద్ద ఉప్పరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. గురువారం పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గురువారం టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే సోమల పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 269 మందికి టీకాలు వేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరనాద్, గీత తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ అగ్ని ప్రమాదంపై సీఐడీ విచారణ జరిపించాలి

చౌడేపల్లె, జూన్6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాదంపై సీఐడీ విచారణ చేపట్టాలని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లా డుతూ మే 14న ఆలయం సమీపంలో పిడుగులు పడి ఆలయ కార్యాలయంలో పలు వస్తువులు అగ్నికి ఆహుతైన విషయంపై వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఆలయ ఈవో చంద్రమౌళిల హస్తం ఉందని ఆరోపించారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి సుమారు రూ..5 కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వీటి అన్నిటిపైన తాము సీఐడీ విచారణ కోరనున్నట్లు తెలిపారు.

గానుగచింత రోడ్డును బాగుచేయండి



రొంపిచెర్ల, జూన్ 6: మండలంలోని గానుగచింత, పెద్ద మల్లెల, చల్లంపల్లె, బోడిపాటివారిపల్లెకు వెళ్లే తారు రోడ్డు మరమ్మతులకు గురయ్యాయి. గుంతలమయమయ్యాయి. చిన్నపాటి వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి బురదనీరు పాదచారులపై పడుతోంది.

అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జూన్ 6: రాష్ట్రంలో అర్హులైన అన్ని వర్గాల ప్రజల ఆర్థిక ఎదుగుదలే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందజేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మెన్ సీతాపతి తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం సాధించడంతో గురువారం రామకుప్పంలోని టీడీపీ గాండ్ల కులస్తుల పార్టీ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో దగా పడ్డ అట్టడుగు వర్గాల అభ్యున్నతి, అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం టీడీపీ కృషి చేస్తుందన్న నమ్మకంతో రాష్ట్ర ప్రజానీకం యావత్తు టీడీపీ కూటమిని ఆదరించారన్నారు. అరాచకం, అవినీతి, దౌర్జన్యాలు లేని ప్రజా పాలనను కూటమి అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు నందారెడ్డి, వెంకటరమణ, గాండ్ల కుల టీడీపీ నేతలు బాలరాజు, మంజునాథ్, అమరనాథ్, టీవీరవి, అలివేలమ్మ, బీడాసుబ్రహ్మణ్యం, మిఠాయిమంజునాథ్, అజయ్‌కుమార్, శంకర్, బొరుగులశీనా, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రామకుప్పానికి చెందిన నేతలు సాగర్‌రెడ్డి, సతీష్, అవనాశ్, సుబ్రీ, నరసింహులు తదితరులు పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డిని సన్మానించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

గంగాధరనెల్లూరు, జూన్ 6: పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని ఎంఈవో కాణిపాకం ఆంజనేయులుశెట్టి, సహాయ కార్మిక శాఖ అధికారి జగదీష్‌బాబు, సీఐ శంకర్ హెచ్చరించారు. ఈ మేరకు గంగాధరనెల్లూరులో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీసీపీయూలు మురళి, సబితా, ఉమాదేవి, సీఆర్పీలు భూలక్ష్మి, హరిబాబు, గుణశేఖర్, దేవేంద్రరెడ్డి, కుమారి, డి.గుణశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కంచుకోటలో టీడీపీ పాగా

విజయపురం, జూన్ 6: 2024 సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని వైసీపీ కంచుకోటకు బీటలు వారాయి. మండలంలో పోలింగ్ స్టేషన్ నెంబరు 221 ఆలపాకంతో ప్రారంభమై 229 మల్లారెడ్డి కండ్రిగతో పూర్తవుతుంది. నగరి నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి శ్రీహరిపురం, మల్లారెడ్డి కండ్రిగ పోలింగ్ కేంద్రాలు గతంలో కాంగ్రెస్, నేడు వైసీపీకి కంచుకోటలుగా ఉన్నాయి. 2019 ఎన్నికల్లో మల్లారెడ్డికండ్రిగలో 161 ఓట్లు, శ్రీహరిపురంలో 263 ఓట్లు వైసీపీకీ మెజారిటీ వచ్చింది. 2024 ఎన్నికల్లో మల్లారెడ్డి కండ్రిగలో 281 ఓట్లు, శ్రీహరిపురంలో 17 ఓట్లు టీడీపీకీ మెజారిటీ వచ్చింది. జగన్నాథపురం, క్షూరికాపురంలో కొందరు నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో ఆ పార్టీకి పట్టు పెరిగింది. వైసీపీ కంచుకోటలు ఇళ్లత్తూరు, కాళికాపురం, మాధవరం, ఆలపాకం గ్రామాల్లో సైతం టీడీపీ నేతలు తమ సత్తాచాటారు.

వైభవంగా చక్రస్నానం


పల్లకిలో విహరిస్తున్న స్వామివారు

కార్వేటినగరం, జూన్ 6: వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం చక్రస్నానంతో ముగిశాయి. స్కంద పుష్కరిణి వద్ద స్వామికి ముందుగా వేద పండితులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించి, బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. సాయంత్రం పల్లకి ఉత్సవంలో భాగంగా స్వామి వారు తిరువీధుల్లో ఊరేగారు. చివరిగా ధ్వజావరోహణం నిర్వహించారు. టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

భానుప్రకాష్‌కు సన్మానం



నింద్ర, జూన్ 6: నగరి ఎమ్మెల్యేగా ఎన్నికైన గాలి భానుప్రకాష్‌ను గురువారం నింద్ర మండల టీడీపీ నాయకులు తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిసి సన్మానించారు. టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు వెంకటేశులునాయుడు, రవినాయుడు, తేజేష్, ఆనందరాజు, గాలి రమేష్‌నాయుడు, రవిరాజు, ఓంప్రకాష్, మురళినాయుడు, గంగాధరం నాయుడు, రాము, శివప్రసాద్ ఉన్నారు.

ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


దాతలను సన్మానిస్తున్న గోపి

పూతలపట్టు, జూన్ 6: మండలంలోని వావిల్‌తోట పంచాయతీ పాపానాయుడుపల్లి గ్రామంలో విజయమ్మ, కృష్ణమనాయుడు జ్ఞాపకార్థం జీకేఎన్ ఫౌండేషన్ సౌజన్యంతో రూ.3లక్షలతో నూతనంగా నిర్మించిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది, టీడీపీ నేత వి.సురేంద్రకుమార్, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, ప్లాంట్ దాతలు మధు, జగదీష్, నాయకులు రామూర్తి నాయుడు, గోవర్ధన్, జగన్నాథం, నాదముని పాల్గొన్నారు.

మొక్కుల చెల్లింపు



పూతలపట్టు, జూన్ 6: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం, పూతలపట్టు ఎమ్మెల్యేగా మురళీమోహన్ విజయం సాధించడంతో పూతలపట్టు మండల టీడీపీ నాయకులు గురువారం కాణిపాక వినాయకస్వామికి తలనీలాలు సమర్పించారు. ఇందులో సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు కార్తికేయ చౌదరి, నేతలు వేణు, సంపత్‌నాయుడు, ఏకాంబరం, నిత్యానందం ఉన్నారు.

ఎన్డీఏలో టీడీపీ భాగస్వామ్యం
రాష్ట్రానికి సానుకూల అంశం : భానుప్రకాష్


ఆలయం వద్ద భానుప్రకాష్

తిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమిలో టీడీపీ భాగస్వామ్యం శుభ పరిణామమని, రాష్ట్రానికి మంచి రోజులు రాబోతున్నాయని ఆ పార్టీ నగరి ఎమ్మెల్యేగా ఎన్నికైన గాలి భానుప్రకాష్ అన్నారు. రాష్ట్ర హక్కులు, నిధులు సాధించుకోవడానికి అవకాశముంటుందని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన తొలిసారిగా గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరూ రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఏకపక్షంగా తీర్పు ఇచ్చారని తెలిపారు. మోదీ ప్రమాణ స్వీకారం అనంతరం చంద్రబాబు ప్రమాణస్వీకారం ఉంటుందన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీరంగరాజపురం, జూన్ 6: రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయం సాధించడం, గంగాధరనెల్లూరులో డాక్టర్ థామస్ గెలుపొందడంతో ఎస్ఆర్‌పురం మండలం సింధురాజపురం గ్రామంలో వెలసిన అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేయించి, స్వామిని స్తుతిస్తూ భజనలు చేశారు. ఆలయ చైర్మన్ బాలాజీ నాయుడు, వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, ట్రెజరర్ సుబ్రమణ్యం నాయుడు, కమిటీ సభ్యులు రమేష్ నాయుడు, బ్రహ్మ నాయుడు, లోకనాథం రాజు, ఆనందనాయుడు, ప్రకాష్ యాదవ్, సురేంద్ర బాబు, గోపాల్ కృష్ణవర్మ, మాధవనాయుడు, పురుషోత్తం, బుల్లెట్ బాబు, ఊశ్వర్ నాయుడు, దేవరాజులునాయుడు పాల్గొన్నారు.

చలపలమ్మకు కొబ్బరికాయల సమర్పణ



నగరి జూన్6: నగరిలో భానుప్రకాష్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో మండల పరిధిలోని తడుకుపేట చలపలమ్మ గుడి వద్ద ఆ గ్రామ మహిళలు 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. రామమూర్తి, రజని, వరలక్ష్మి, సెల్వకుమార్, హేమాద్రి పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన భీమనేని



పాలసముద్రం, జూన్ 6: టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడును గురువారం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును ఆయన స్వగృహంలో కలిశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలిసి నియోజకవర్గ వివరాలను అందజేశారు.

టీడీపీ కార్యాలయంలో సంబరాలు



పాలసముద్రం, జూన్ 6: గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేగా డాక్టర్ థామస్ గెలుపొందడంతో గురువారం పాలసముద్రం టీడీపీ కార్యాలయంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసునాయుడు, రవి నాయుడు, జె.విజయ్‌కుమార్, వాసు యాదవ్, అరుళ్‌నాథన్, సాంబశివన్, తంగరాజ్ పాల్గొన్నారు.

పాలసముద్రంలో వర్షం

పాలసముద్రం, జూన్ 6: మండలంలో గురువారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. చెక్‌డ్యామ్‌లు, కుంటలకు నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

వెదురుకుప్పం: మండలంలో ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉండడంతో ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరయ్యారు. సాయంత్రం వాన కురవడంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.


లోకేశ్‌తో మురళీమోహన్


లోకేశ్‌తో గురుజాల జగన్మోహన్


చంద్రబాబుతో థామస్

అధినాయకుడిని కలిసి.. అభినందనలు తెలిపి..

చిత్తూరు సిటీ, జూన్ 6: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఉండవల్లిలో టీడీపీ పార్లమెంటరీ సభ్యుల సమావేశానికి హాజరైన చిత్తూరు ఎంపీగా ఎన్నికైన దగ్గుమళ్ల ప్రసాదరావును చంద్రబాబు అభినందించారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ చంద్రబాబును కలసి శుభాకాంక్షలు తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు, ఎమ్మెల్యేలుగా ఎన్నికైన గురజాల జగన్మోహన్, కలికిరి మురళీమోహన్ నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. పలమనేరు ఎమ్మెల్యేగా ఎన్నికైన అమరనాథరెడ్డి కూడా లోకేశ్‌ను కలిశారు.


చంద్రబాబుతో దగ్గుమళ్ల ప్రసాదరావు


చంద్రబాబుతో గురజాల

ఎస్ఈబీ డీఎస్ఈవో సుబ్బరాజుకు ప్రశంసాపత్రం



చిత్తూరు, జూన్ 6: ఎన్నికల విధుల్లో సాంకేతికతతో ప్రజల భాగస్వామ్యాన్ని సమర్థవంతంగా ఉపయోగించడంలో కృషిచేసిన ఎస్ఈబీ డీఎస్ఈవో సుబ్బరాజుకు రన్నరప్ ట్రోఫీని అందించారు. గురువారం రాష్ట్ర కార్యాలయంలో సెబ్ కమిషనర్ రవిప్రకాష్ చేతుల మీదుగా ఈ ట్రోఫీని అందుకున్నారు. ఆయన్ను ఎస్పీ మణికంఠ చందోలు అభినందించారు.

ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారు
ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు

చిత్తూరు, జూన్ 6: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో జిల్లా ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇవ్వడం సంతోషదాయకమని జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కేవీ రాఘవులు, కార్యదర్శి రఘు అన్నారు. నాలుగోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న చంద్రబాబు ఉపాధ్యాయ, ఉద్యోగుల న్యాయమైన కోరికలను పరిష్కరించాలని కోరారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పోస్టల్ బ్యాలెట్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

స్వామిదాస్‌కు పలువురి శుభాకాంక్షలు



గంగాధరనెల్లూరు, జూన్ 6: టీడీపీ మండలాధ్యక్షుడు బి.స్వామిదాస్ పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు ఆయన్ను గజమాలతో సన్మానించారు. నేతలు రాంబాబురెడ్డి, దేవసుందరం, కేతినేని లోకేష్‌నాయుడు, జ్యోతిరెడ్డి, లోకమ్మ, భువనేశ్వరి, రాజేంద్ర శెట్టి, జీవరత్నం, చంద్రబాబుగౌడ్, శేఖర్, సంపత్, జయప్రకాష్, మునస్వామి, జాన్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆరణికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

చిత్తూరు సిటీ, జూన్ 6: తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని జనసేన, బలిజ సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో బలిజ సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అని పేర్కొన్నారు. పైగా రాయలసీమలో అత్యధిక మెజారిటీతో గెలుపొందారని అన్నారు. జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు ఓఎం రామదాసు, నేతలు రెడ్డెప్ప, తుల సీరామ్, బాలాజి, వరదరాజులు, నరసింహులు జనసేన నేతలు శ్రీకాంత్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషి వల్లే టీడీపీ విజయం

చిత్తూరు సిటీ, జూన్ 6: అందరి సమష్టి కృషి వల్లే కూటమి విజయం సాధించిందని, ఇందుకు సహకరించిన టీడీపీ శ్రేణులకు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు.

కొల్లు రవీంద్రను కలసిన షణ్ముగం

చిత్తూరు సిటీ, జూన్ 6: మచిలీపట్నం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొల్లు రవీంద్రకు చిత్తూరు టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం శుభాకాంక్షలు తెలిపారు. గురువారం విజయవాడలోని కొల్లు రవీంద్ర నివాసంలో ఆయనను కలసి శ్రీవారి ప్రసాదాన్ని అందించారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్నాక్యాంటీన్


అన్నదానం చేస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు, బాలాజీ నాయుడు

గుడిపాల, జూన్ 6: మండలంలోని నిరుపేదల ఆకలి తీర్చేందుకే అన్నాక్యాంటీన్‌ను నిర్వహిస్తున్నామని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు అన్నారు. గురువారంతో అన్నదాన కార్యక్రమం సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరుపేద కుటుంబాలను ఆదుకోవడమే టీడీపీ ప్రధాన లక్ష్యమని అన్నారు. మాజీ సర్పంచ్‌లు ప్రతాప్ నాయుడు, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, బాబు, టీడీపీ నాయకులు బాబురెడ్డి, రంగారెడ్డి, శంకర్ చౌదరి, శివలింగా రెడ్డి పాల్గొన్నారు.

వర్షపు నీటిని తొలగించండి



కార్వేటినగరం, జూన్ 6: మండల కాంప్లెక్స్ ప్రవేశద్వారం వద్ద నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడికి చేరే నీరు బయటకు వెళ్లేందుకు గతంలో ఉన్న కాల్వను పూడ్చేయడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండడం వల్ల ఎక్కువ మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, మురుగు నీటి కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోందని, అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఇంద్రవరదుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

యాదమరి, జూన్ 6: స్థానిక వరదరాజస్వామి ఆలయంలో గురువారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఆగమశాస్త్రం ప్రకారం అంకురార్పణ చేశారు. ఉదయం మూలస్థానంలోని శ్రీదేవి, పెరందేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి పుట్టమన్ను తీసుకొచ్చి విశేష పూజలు నిర్వహించి, కంకణాలు ధరించారు. అనంతరం విశ్వక్సేనుడు మాడవీధుల్లో విహరించి ముక్కోటి దేవతలకు బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలికారు.

నేడు ధ్వజారోహణం

స్వామివారి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ఉదయం 8 గంటలకు ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం మూలవిరాట్టుకు అభిషేకాలు నిర్వహించి, వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంలో విహరించనున్నారు.

జీడీనెల్లూరులో తొలిసారి టీడీపీ జెండా రెపరెపలు

వెదురుకుప్పం, జూన్ 6: పునర్విభజనతో కొత్తగా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో తెలుగుదేశం జెండా రెపరెపలాడింది. వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిపై టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్ విజయం సాధించారు. వేపంజేరి నియోజకవర్గంలో ఆరుసార్లు జరిగిన ఎన్నికల్లో నాలుగుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. నియోజకవర్గాల పునర్విభజనలో ఆరు మండలాలతో జీడీనెల్లూరు నియోజకవర్గం ఏర్పడింది. ఆ తర్వాత 2009వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ గుమ్మడి కుతూహలమ్మ విజయం సాధించి, నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా చరిత్రకు ఎక్కారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కుతూహలమ్మ ఓటమిపాలయ్యారు. 2019 ఎన్నికల్లో కుతూహలమ్మ రాజకీయ వారసుడు డాక్టర్ ఆనగంటి హరికృష్ణ టీడీపీ అభ్యర్థిగా ఓటమిపాలయ్యారు. ఈసారి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి డాక్టర్ వీఎం థామస్ విజయం సాధించి చరిత్ర సృష్టించారు. నియోజకవర్గంలో 2,04,949 మంది ఓటర్లు ఉండగా 1,81,777 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని 'తీర్పు' చెప్పారు.

నగరిలో భానుప్రకాష్ రికార్డు

నగరి మే6: నగరి నియోజకవర్గంలో 45,008 ఓట్ల మెజారిటీ సాధించి గాలి భానుప్రకాష్ రికార్డు సృష్టించారు. నియోజకవర్గం 1962లో ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిలారి గోపాల్‌నాయుడిపై దొమ్మరాజు గోపాల్‌రాజు ఇండిపెండెంట్‌గా 1,537 ఓట్లతో గెలుపొందారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థి కిలారి గోపాల్‌నాయుడు ఎస్‌డబ్ల్యుఏ అభ్యర్థి సిద్ధయ్యపై 7,815 ఓట్లతో 1972లో డీఎంకే అభ్యర్థి జ్ఞానప్రకాష్‌పై 28,072 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థి చిలకం రామచంద్రారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రెడ్డివారి చెంగారెడ్డి 7,453 ఓట్లతో విజయం సాధించారు. 1983లో టీడీపీ తరఫున పోటీ చేసిన ఈవి గోపాల్‌రాజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చెంగారెడ్డిపై 12,152 ఓట్లతో గెలుపొందారు. 1985లో టీడీపీ అభ్యర్థి ఏఎం రాధాకృష్ణపై కాంగ్రెస్ అభ్యర్థి చెంగారెడ్డి 1,142 ఓట్లతో, 1989లో బీజేపీ అభ్యర్థి చిలకం రామచంద్రారెడ్డిపై 16,175 ఓట్లతో గెలిచారు. 1994లో టీడీపీ అభ్యర్థి దొరస్వామిరాజు కాంగ్రెస్ అభ్యర్థి చెంగారెడ్డిపై 13,105 ఓట్లతో విజయం సాధించారు. 1999లో కాంగ్రెస్ అభ్యర్థి చెంగారెడ్డి టీడీపీ అభ్యర్థి దొరస్వామిరాజుపై 3,114 ఓట్లతో గెలుపొందారు. 2004లో టీడీపీ అభ్యర్థి ఆర్కే రోజాపై కాంగ్రెస్ పార్టీ నుంచి చెంగారెడ్డి 5,694 ఓట్లతో గెలిచారు. 2009లో టీడీపీ అభ్యర్థి గాలి ముద్దుకృష్ణమనాయుడు కాంగ్రెస్ అభ్యర్థి చెంగారెడ్డిపై 1,308 ఓట్లతో గెలిచారు. 2014లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆర్కే రోజా టీడీపీ అభ్యర్థి గాలి ముద్దుకృష్ణమనాయుడిపై 858 ఓట్లతో, 2019లో టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్‌పై 2,708 ఓట్లతో గెలుపొందారు. నగరి నియోజకవర్గం ఏర్పడ్డాక 2024లో టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ వైసీపీ అభ్యర్థి రోజాపై 45,004 భారీ మెజారిటీతో గెలిచి రికార్డు సృష్టించారు.

గురజాలకు 148 పోలింగ్ కేంద్రాల్లో మెజార్టీ

- చిత్తూరు నగరం, రూరల్‌లో మంచి ఆదరణ
- గుడిపాలలో స్వల్పంగా తగ్గిన ఓట్లు

చిత్తూరు సిటీ, జూన్ 6: చిత్తూరు ఎమ్మెల్యేగా గురజాల జగన్మోహన్ 14,604 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నియోజకవర్గంలోని 225 పోలింగ్ కేంద్రాల్లో 149 చోట్ల ఆయనకు మంచి మెజారిటీ వచ్చింది. 76 కేంద్రాల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన విజయానందరెడ్డికి ఎక్కువ ఓట్లు పడ్డాయి. గురజాల సొంత మండలం గుడిపాలలో స్వల్పంగా ఓట్లు తగ్గాయి. నియోజకవర్గంలో 1,63,199 వ్యాలిడ్ ఓట్లు రాగా గురజాలకు 85,734 ఓట్లు, విజయానందరెడ్డికి 72,399 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో గురజాలకు 2,332, వీఎన్ఆర్‌కు 1,063 ఓట్లు పడగా టీడీపీకి 1,269 మెజారిటీ వచ్చింది. చిత్తూరు రూరల్ మండలంలో 3,830 ఓట్ల మెజార్టీ వచ్చింది. మాపాక్షి పోలింగ్ కేంద్రంలో 934 ఓట్లుండగా టీడీపీకి 679 వచ్చాయి. గురజాల సొంత మండలం గుడిపాలలో 450 ఓట్ల వరకు వైసీపీ అభ్యర్థికి ఎక్కువగా పోలయ్యాయి. గుడిపాలలోని రామాపురం, మండికృష్ణాపురం, పానాటూరు కేంద్రాల్లో టీడీపీకి మెజార్టీ తగ్గింది. చిత్తూరు నగరంలో టీడీపీకి 10 వేలకుపైగా ఓట్ల మెజార్టీ వచ్చింది.

'ఎమ్మెల్యే, ఎంపీకి తెలీకుండా చిత్తూరులో దాడులు'


సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు, జూన్ 6: చిత్తూరులో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల తర్వాత విధ్వంసం, దాడులతో పాటు ఆస్తులను ధ్వంసం చేశారని ఏపీఎస్ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ దాడులతో ఎమ్మెల్యేకి, ఎంపీకి సంబంధం లేదన్నారు. చిత్తూరులో ఓ వ్యక్తి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలన్న ఉద్దేశంతో రెచ్చిపోతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో విజయం సాధించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులకు శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీకి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మీడియా సమావేశంలో నగర మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, నేతలు పురుషోత్తంరెడ్డి, టిమ్ము తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య


మృతిచెందిన కేశవులు రెడ్డి

బంగారుపాళ్యం, జూన్ 6: అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని కుమ్మరపల్లికి చెందిన చెంగారెడ్డి కుమారుడు కేశవులు రెడ్డి (50) బెంగళూరులో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆటో నిర్వహణ, కుటుంబ పోషణ కోసం పలువురి వద్ద అప్పులు చేశాడు. తీర్చలేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల అక్రమాలపై విచారణ జరిపించాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, జూన్ : డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారుల అక్రమాలపై విచారణ జరిపించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసు నుంచి వచ్చిన అధికారులు అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నూతన ప్రభుత్వం రాకముందే, ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే రిలీవ్ చేసి పంపించడం సీఎస్ జవహర్ రెడ్డికి తగదని పేర్కొన్నారు. వారు ఇతర దేశాలకు పారిపోకుండా ఉండడానికి పాస్‌పోర్టులు రద్దు చేయాలన్నారు. పార్టీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు మేషాక్, ధరణి ప్రకాష్, సురేష్, గోవిందరాజులు, బాలకృష్ణ నాయుడు, శరవణ పాల్గొన్నారు.

భానుప్రకాష్‌కు శ్రీవారి ప్రసాదాలు


భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న నేతలు

నగరి, మే 6: నగరి ఎమ్మెల్యేగా ఎన్నికైన గాలి భానుప్రకాష్‌ను గురువారం తిరుపతిలోని ఆయన నివాసంలో పలువురు నాయకులు కలిసి సన్మానించారు. శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సన్మానించిన వారిలో శ్రీనివాసన్, మది వాసన్ కృష్ణారెడ్డి, పురుషోత్తంనాయుడు, బాలాజి, సురేష్ నాయుడు, ధనంజయరాజు, ఉమాపతిరాజు, సుబ్రమణ్యం రాజు, వెంకటాచలంనాయుడు, రవినాయుడు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోండి

బంగారుపాళ్యం, జూన్ 6: 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని జిల్లా అదనపు వైద్యాధికారి వెంకటప్రసాద్ అన్నారు. మండలంలోని గుంతూరు గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. డాక్టర్ లోహిత్ చెంగల్రాయన్, ఎంపీహెచ్‌వో రమేష్‌బాబు, ఏఎన్ఎంలు రమాదేవి, బిందు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



బంగారుపాళ్యం, జూన్ 6: రామచంద్రనాయుడు జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు, జేబీటీ ట్రావెల్స్ అధినేత ఎన్‌పీ కిరణ్, స్వాతి బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద గల అన్నాక్యాంటీన్‌లో గురువారం అన్నదానం చేశారు. వందలాది మందికి భోజనం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మణి మృతదేహం

పాకాల, జూన్ 6: పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి పాకాల మండలం నేంద్రగుంట సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత సైనికుడు మృతి చెందారు. చిత్తూరు దొడ్డిపల్లెకు చెందిన విశ్రాంత సైనికుడు ఎన్.మణి (50) తిరుపతి చెర్లోపల్లె సమీపంలోని ఎస్వీ డిఫెన్స్ అకాడమిలో పనిచేస్తున్నారు. అక్కడే ఉంటూ వారానికి ఒకసారి స్వగ్రామానికి వెళ్లి వచ్చేవారు. గురువారం మోటరు సైకిల్‌పై చిత్తూరు వైపు వెళుతూ నేంద్రగుంట ఫ్లైఓవర్‌పై లారీని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో మణి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద స్థలాన్ని సందర్శించిన పాకాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ స్టిక్కర్ల తొలగింపు



కార్వేటినగరం, జూన్ 6: రాష్ట్రంలో అధికార మార్పిడి జరుగబోతున్న తరుణంలో మండలంలోని పశు సంవర్ధక శాఖ సంచార వాహనంపై ప్రధాని మోదీ, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను సిబ్బంది తొలగించారు.

సహకార శాఖ
మాజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మృతి


మనోహర్ (ఫైల్)

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 6: ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన కేఎస్ మనోహర్(68) గురువారం ఉదయం మృతి చెందారు. సహకార శాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా, జిల్లా సహకార శాఖ కార్యాలయంలో, చిత్తూరు, తిరుపతి డివిజనల్ సహకార కార్యాలయాల్లో, డీసీసీబీ ఓఎస్డీగా పనిచేశారు. పలు స్వచ్ఛంద సంస్థల్లో సభ్యుడిగా ఉన్నారు. ఆయన భౌతిక కాయానికి డీసీవో నాగవర్ధన, డీసీఏవో బ్రహ్మానంద రెడ్డి, చిత్తూరు డీఎల్‌సీవో వనజ, డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్, సీడీసీఎంఎస్, కోఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్ సిబ్బంది ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

మహిళపై దాడి కేసులో జైలుశిక్ష

చిత్తూరు లీగల్, జూన్ 6: మహిళపై దాడిచేసిన ఐదుగురికి చిత్తూరు న్యాయస్థానం ఆరునెలల జైలుశిక్ష, జరిమానా విధించింది. బంగారుపాళ్యం మండలం వినాయకపురం గ్రామానికి చెందిన రామయ్య భార్య సుభాషిణిపై అదే గ్రామానికి చెందిన మునిరాజు, మునస్వామి, గణేష్, మోహన్, మీనాక్షి 2018 సెప్టెంబరు 26వ తేదీన దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బంగారుపాళ్యం పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. గురువారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిపిన న్యాయమూర్తి ఉమాదేవి ఈ మేరకు శిక్ష విధించారు.